# "దేవా, మాకు నాయకులను ప్రసాదించు!"

## (2 సమూ. 2-6; 23; 1 దినవృ. 11-14)

"మంచి నాయకులను ప్రసాదించుము!" అనేది నేటి మన విన్నపం! మనం ప్రభుత్వాన్ని గూర్చి, సంఘమును గూర్చి, యింటిని గూర్చి మాట్లాడినా మన విన్నపం అదే. ఒక జాతిగా మనం ఎదుర్కొనే సవాలులను గూర్చి మాట్లాడినప్పుడు, సమైక్యత కలిగిన మనష్యులెక్కడ ఉన్నారు? "యథార్థవంతులైన మనుష్యులెక్కడ ఉన్నారు?" అని మనం అడుగుతాం. గృహములలోని సమస్యలను గూర్చి మనం వేదనపడినప్పుడు, "పురుషులు గృహములలో, ప్రత్యేకించి ఆత్మ సంబంధమైన విషయాలలో ముందుకు నడిపించటంలేదని మనం తీర్మానించవలసి వస్తుంది." ప్రభువు సంఘమునకు ఎదురౌతున్న సమస్యలను గూర్చి మనం చర్చించినప్పుడు, "వారు ఈ విషయాలను చేపట్టగలరు, చేస్తారు కూడా" అని మనం తీర్మానిస్తాం.

ఈ సమస్యలు మన దేశంలోనే మాత్రం కాదు; లోకంలో అంతటా ఉంటాయి. ఎక్కువగా ప్రయాణం చేసే వారిని మనం సందర్శించితే, ఏదేశం గూర్చి చర్చించినా, తప్పనిసరిగా తీర్మానమేమై యుంటుందంటే, "మంచి నాయకత్వమే అత్యంతావశ్యకం" అనేదే. "దేవా, మాకు నాయకులను ప్రసాదించుము!" అనేది సార్వత్రికమైన విన్నపమై యుంది!

నాయకత్వ అవసరం క్రొత్తది కాదు, ఈ తరాన్ని మాత్రమే ప్రత్యేకంగా చెందినదీ కాదు. దేవుని అంగీకారం పొందిన దేవునిచే ఘనపరచబడిన నాయకత్వం సంవత్సరాల తరబడి నడిచింది. రాజైన సౌలు మృతిచెంది, దావీదు రాజుగా చేయబడినప్పుడు అది తప్పకుండా ఉంది. ఫిలిష్తీయులతో యుద్ధం చేస్తూ సౌలు చనిపోయినప్పుడు, సింహాసనానికి వెళ్లే మార్గం దావీదుకు తెరువబడినట్టు గత పాఠంలో మనం చూచాం. ఇశ్రాయేలు దేశానికి అపజయంవల్ల కలిగిన ప్రభావాన్ని మనం చూడలేదు.

ఫిలిష్తీయులతో జరిగిన దురదృష్టమైన యుద్ధానికి ముందు కూడా, ఇశ్రాయేలు కలత చెందిన దేశంగానే ఉంది. నలభై సంవత్సరాల సౌలు యొక్క బాధ్యతా రహితమైన, లోపభూయిష్టమైన ఏలుబడి దేశాన్ని రాజకీయంగాను, ఆర్థికంగాను, ఆత్మ సంబంధంగాను క్షీణింపజేసింది. తన సొంత గోత్రానికి సౌలు చూపిన అభిమానం దేశాన్ని విభజించింది. పిచ్చిగా దావీదు వెంట పడడంలో దేశీయమైన అక్కరలను అలక్ష్యం చేశాడు. అతడు యాజకులను సంహరించగా, ప్రధాన యాజకుడు దావీదును ఆశ్రయించవలసి వచ్చింది. దీనంతటికి పైగా, ఇశ్రాయేలీయుల సైన్యం ఫిలిష్తీయులచే బొత్తిగా ఓడిపోయింది, సౌలు అతని కుమారులును చంపబడ్డారు ఆ అపజయము యొక్క ఫలితాలను 1 సమూ. 31:7 తెలుపుతుంది:

లోయ అవతలనున్న ఇశ్రాయేలీయులను, యొర్దాను అవతలనున్నవారును, ఇశ్రాయేలీయులు పారిపోవుటయు, సౌలును అతని కుమారులును చచ్చియుండుటయు చూచి తమ నివాసగ్రామములు విడిచిపెట్టి పారిపోయిరి. ఫిలిష్తీయులు వచ్చి వాటిలో కాపురముండిరి.

అనుభవం లేకుండా ఈ సంగతులు గ్రహించడం కష్టం. పరదేశీయులు వచ్చి మన దేశాలపైబడి, దేశపు ఏలికలను చంపి, వారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసికొని ఏలుబడి చేస్తే ఎలాగుంటుందో ఇశ్రాయేలీయుల స్థితి అప్పటిలో అలాగేవుంది. ఫిలిప్పు కెల్లర్ ఇశ్రాయేలు స్థితిని గూర్చి యిలా వ్రాశాడు:

తమ శత్రువులైన ఫిలిష్తీయుల ఇనుప మడిమ క్రింద ఇశ్రాయేలు దేశమంతా ధ్వంసం చేయబడి సాష్టాంగపడింది. రమ్యమైన పట్టణాల్లో ఎక్కువ భాగం కనికరంలేక దండెత్తిన వారిచేత ఆక్రమించబడ్డాయి. గతంలో సౌలుచే పాలింపబడిన భూ భాగం బలవంతంగా కైవశం చేయబడి, వారి అధికారంచేత కంట్రోల్ చేయబడుతుంది. పోరాటంలో అణగగొట్టబడి, యుద్ధంచే చీల్చబడిన జనంగా ఇశ్రాయేలీయులు ఉన్నారు.[1]

ఏదైనా దేశము నాయకత్వం కొరకు ఎప్పుడైనా విలపించియుంటే, అది దావీదు సింహాసనానికి వచ్చినప్పుడున్న ఇశ్రాయేలే.

రాజుగా దావీదు ఎదుర్కొన్న ఆరంభ సవాళ్లను గూర్చినది ఈ పాఠం. మన పాఠ్యభాగం 2 సమూ. 2-6; 23; 1 దినవృ. 11-14. దేవుని సహాయంతో యెష్షయి కుమారుడు తన సవాళ్లను ఎలా ఎదుర్కొన్నాడో చూస్తూ, బహుగా నేడు అవసరమైయున్న నాయకత్వాన్ని గూర్చి మనం కొంత నేర్చుకుందాం.

## జ్ఞానముగల నాయకులు శీలముగల పురుషులై ఉంటారు (2 సమూ. 2:1-7)

ఇశ్రాయేలుకు నాయకత్వం అవసరం, అయితే ఏలాటి నాయకుడైనా వారికి అవసరం లేదు. తునిగిపోయి రక్తం కారుతున్న ఆ దేశానికి ఒక గట్టి మనిషి, సునిసితమైన మనిషి, దేవుని మనిషి కావాలి. అలాటి ఒక మనిషిని దేవుడు నలభై సంవత్సరాలుగా సిద్ధం చేస్తున్నాడు. కాపరుల పొలంలోను, రాజనగరు విలాసంలోను, అరణ్యపు ప్రతికూలతలోను ఈ పని జరుగుతుంది.

దేవుని నాయకునికి కావలసిన తొలి అవసరం – అతడు న్యాయ బుద్ధిగల మనుష్యుడై యుండాలి. నాయకుడు ఏమి జరిగిస్తాడో, దానితో నాయకత్వం ఆరంభం కాదు; అతడేమైయున్నాడో దానితో అది ప్రారంభమౌతుంది. 2 సమూయేలు ప్రారంభ పేరాగ్రాఫ్‌ల్లో, దావీదు శీలాన్ని కొంత మనం చూచాం: సౌలు మరణం కొరకు విలపించుతూ, అతని ఘనత కొరకు దావీదు ఒక పాట వ్రాశాడు (2 సమూ. 1:1-27); సౌలు మీద పగ ఉంచుకోని ఉన్నతమైన వ్యక్తి దావీదు. తాను యూదా పట్టణాలకు తిరిగి రావాలో లేదో అతడు దేవుని వద్ద విచారించాడు (2:1-3); నడిపింపు కొరకు

అతడు దేవునివైపు చూచిన ఉన్నతమైన శీలంగలవాడు.

2:1లో హెబ్రోనుకు పొమ్మని దేవుడు దావీదుకు సెలవిచ్చాడు. యూదా పట్టణాల్లో హెబ్రోను చాలా ప్రత్యేకమైనది. తన ప్రియమైన శారాను పాతిపెట్టడానికి అబ్రాహాము స్మశాన భూమిని కొన్నది అక్కడే. యెహోషువ సైన్యం దేశాన్ని పట్టుకొన్నప్పుడు, కాలేబు హెబ్రోనును తనకు వారసత్వంగా కోరాడు.

హెబ్రోనులో, అప్పటికి ముప్పది ఏండ్లవాడైన దావీదు, తొలిసారిగా రాజుగా గుర్తింపబడ్డాడు. “అంతట యూదావారు అక్కడికి వచ్చి యూదావారిమీద రాజుగా దావీదునకు[2] పట్టాభిషేకము చేసిరి” (2:4ఎ). కేవలం యూదావారు మాత్రమే దావీదును రాజుగా గుర్తించిన సంగతిని గమనించు. తరువాత ఏడున్నర సంవత్సరాలు దావీదు ఒకే ఒక గోత్రాన్ని – యూదా యింటివారిని ఏలాడు.

దావీదు కిరీటం ధరించినవెంటనే, అతని శీలానికి పోటీ వచ్చింది. “యాబేష్గిలాదువారు సౌలును సమాధి చేసినట్టు క్రొత్త రాజుకు యూదావారు తెలిపారు” (2:5).

సౌలు, అతని కుమారుల మృత దేహాలు ఫిలిష్తీయులు కనుగొన్నప్పుడు, వారు వీరి శిరస్సులను కోసి, దేహాలను బెత్షాన్ గోడకు తగిలించారు. అది ఉత్తర మధ్య ఫిలిష్తీయలో ఉంది. ఫిలిష్తీయులు తమ విజయాన్ని ఇశ్రాయేలీయుల భూ భాగంలో కూడా డాంబికంగా ప్రదర్శనలు జరుపుకొంటున్నారు. వారి అక్రమమును గూర్చిన సమాచారం యాబేష్గిలాదుకు చేరుకుంది. ఈ అన్యజనుల పట్టణానికి సౌలుతోను బెన్యామీనీయులతోను[3] బలీయమైన బాంధవ్యాలున్నాయి. యాబేష్గిలాదువారు, వ్యక్తిగతమైన శ్రమ తీసికొని, బెత్షాన్పైకి దండెత్తి, చీకటి మరుగున ఆ దేహాలను తొలగించి, యాబేష్గిలాదుకు తీసికొనివచ్చి గౌరవప్రదంగా సమాధి చేశారు.[4]

ఇట్టి సమాచారానికి దావీదు ఎలా స్పదించాడు? అలక్ష్యం చేయాలా లేక జవాబు యివ్వాలా? అతడు స్పందించితే, ఎలా స్పందించాలి? యాబేష్గిలాదులో ఉన్నవారు సౌలుకు మహా గొప్ప అభిమానులు. దావీదు యొక్క ప్రతిచర్య అతని స్నేహమయమైన చేతిని చాపుతోంది. ఇశ్రాయేలులో స్వస్థత కలగాలంటే మాత్రం, గతాన్ని సమాధి చేయాలి; మరియు దేవుని అభిషిక్తుడుగా తానే ముందుకు రావాలనే సంగతి దావీదుకు తెలుసు. రాజైన తరువాత అతడు జరిగించిన అధికార పూర్వకమైన కార్యం యాబేష్గిలాదీయులకు వర్తమానికులను పంపి, వారు చేసిన సాహస పూరితమైన దయగల పనికి అభినందన తెలియజేయడమే.

దావీదు ఏలుబడిననుసరించి మనం వెళ్లుతున్నప్పుడు, ఈలాటి ఉన్నతమైన స్వభావానికి యితర ఉదాహరణలను చూద్దాం. “దానితోపాటు అతని దండయాత్ర వాగ్దానాలను”[5] అతడు నిలుపుకొనే ఉదాహరణలు కూడా చూస్తాం. ఈలాటి న్యాయబుద్ధిగల నాయకులు మనకు అవసరం!

## జ్ఞానముగల నాయకులు ఐక్యతకొరకు అక్కర కలిగియుంటారు

## (2 సమూ. 2:8-3:1, 6-13, 17-21)

అవసరమేదో నాయకుడు స్పష్టంగా ఎరుగవలసినవాడై యుంటాడు. గురిని సాధించడానికిగాను అతడు ఏమి ప్రాముఖ్యమైనవో తెలిసినవాడై యుండాలి. గమ్యం చేరేంతవరకు, నిశ్చలంగా దానిని అంటిపెట్టుకుని ఉండాలి.

యాబేష్గిలాదు ప్రజలకు యివ్వబడిన దావీదు దీవెనలో గాయాన్ని మాన్పి ప్రజలను ఏకం చేసే పని గమ్యాలలో మొదటిగా ఉన్నట్టు కన్పిస్తుంది. వారు ఏకమయ్యేవరకు వారి ఉభయులకు శత్రువైన ఫిలిష్తీయను వారు ఎదుర్కొనలేరు. వారు వేరుగా యున్నంతవరకు వారికిని దేవునికిని మధ్య అడ్డుగోడ నిలిచియుంటుంది.[6] వారు ఒక్కటయ్యేవరకు ఎదగలేరు వృద్ధిచెందలేరు. దానికి ఒక గొప్ప కీర్తనను ఆరంభిస్తున్నాడు, "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!" (కీర్తన. 133:1). దేవుని నాయకులకందరికి ఉన్నట్టే దావీదు తీర్మానాలలో ఐక్యత ప్రధానమయ్యింది.[7]

ఐక్యతకు చదునుగా, నీడగా, సాఫీగా బాట ఉందని దాని అర్థం కాదు. ప్రతి ఒక్కరికి ఐక్యత కావాలనే కోర్కె ఉండదు. ఎక్కువ మంది ఐక్యత కావాలంటారు. నేను చిన్నవాడనై యున్నప్పుడు యిలాటిది వాస్తవమనుకునే వాడను. అయితే, ఎక్కువ మంది భేదాన్నే కోరువారున్నట్టు నేను కనుగొన్నాను. తమ స్వలాభాల కొరకు కొందరైతే విభజననే చురుకుగా ప్రోత్సహిస్తారు.

ఐక్యతకు దావీదుకుగల ప్రాథమిక అడ్డంకు అబ్నేరు. సౌలు సేనలో సైన్యాధిపతిగా[8] అబ్నేరు, ఓడింపబడి, చెదరియున్న ఇశ్రాయేలీయులను కూలదీయాలను కుంటున్నాడు. మొదటిలో, దావీదును రాజుగా చేయాలని ఉత్తరాన స్పష్టమైన ఉద్యమం ఉంది.[9] ఆ సమయంలో అబ్నేరు ఉత్తరపు ఇశ్రాయేలీయులవైపు మొగ్గి దావీదు రాజగునట్టు సులభంగా బలపరచియుండేవాడే. దావీదును బలపరచడానికి బదులు అబ్నేరుకు తన సొంత యోచన ఉంది.

అబ్నేరును అర్థం చేసికొనడం కష్టం. అనేక విషయాల్లో అతని అభినందించాలి. అతడు ధైర్యవంతుడు, సామర్థ్యంగల మిలిటరి నాయకుడు, తన యాజమానునికి చాలా నమ్మకమైనవాడు. అతడు చనిపోయినప్పుడు, దావీదు అతనిని, "ఇశ్రాయేలువారిలో ప్రధానుడనియు పెద్దలలో ఒకడనియు" వర్ణించాడు (2 సమూ. 3:38).[10] పైగా దేవుడు సౌలును రాజుగా త్రోసివేసి తరువాత రాజుగా దావీదును కోరుకున్నాడని అబ్నేరు ఎరుగును.[11]

అప్పుడు అబ్నేరు దావీదును ఎందుకు బలపరచలేదు? సౌలు జ్ఞాపకానికి అతడు నమ్మకస్థుడుగా ఉండగోరినందున కావచ్చు. (అనేకులు తలంచునట్టు) అబ్నేరు స్వార్థపరమైన అభ్యుదయేచ్ఛ కలిగినవాడై యుండవచ్చు. 3:6లో యిలా గుర్తింపబడింది: "సౌలు కుటుంబికులకును దావీదు కుటుంబికులకును యుద్ధము జరుగుచుండగా అబ్నేరు సౌలు కుటింబికులకు బహు సహాయముచేసెను." అబ్నేరు సౌలుకు బంధువు[12]

అందువలన సింహాసనంపై కూర్చుండ నిరీక్షించాడు కాబోలు.

అబ్నేరు యొక్క కారణాలు ఏమైయున్నా, ఇశ్రాయేలులో అంతఃకలహాలకు అతడు కారకుడై, యూదా సైన్యంతో యుద్ధం చేయడానికి కొన్ని సంవత్సరాలు వారిని రేపుతుండేవాడు. 2:12–32లో, ఆ యుద్ధాల్లో ఒక దానిని గూర్చి మనం చదువుతాం. యెరూషలేముకు కొన్ని మైళ్లు ఉత్తరంగా, గిద్యోను యొక్క శృంగారమను కోనేటివద్ద అబ్నేరు, అతని మనుష్యులు యోవాబును[13] అతని సైన్యాన్ని కలుసుకున్నారు. యోవాబుతో అతని యిద్దరు సహోదరులగు: అబిషైయ్యు,[14] అశాహేలును ఉన్నారు. వీరందరు దావీదుకు బంధువులే.[15] నేరుగా యుద్ధం జరగడానికి బదులు, తన మనుష్యులలో పన్నిద్దరును, యోవాబు మనుష్యులలో పన్నిద్దరును నేరుగా తలబడమని అబ్నేరు సలహాయిచ్చాడు – దావీదుకు గొల్యాతుకు జరిగిన పోరాటం వంటిది. అయితే కొద్ది సేపటిలోనే భయంకరమైన రణరంగంగా మారిపోయింది. యోవాబును అతని సేనలును తిరుగులేని విజయాన్ని సాధించారు.[16]

అబ్నేరును అతని సైన్యమును పారిపోగా, అడవి లేడియంత తేలికగా పరుగెత్తగల యోవాబు సహోదరుడైన అశాహేలు అబ్నేరును వెంటబడ్డాడు. అబ్నేరు ఆ యువకుని చంప మనస్సు లేనివాడై ఆగిపొమ్మన్నాడు (2:22), అయితే అశాహేలు అలా చేయలేదు. కడకు, అబ్నేరు అతని ఈటె మడమను అతని కడుపులోనికి దించగా, అశాహేలు అక్కడనే పడి చచ్చాడు (2:23).[17] ఈ దుర్ఘటన అబ్నేరును తరమడం తగ్గించింది. అబ్నేరు తిరిగి బలం పుంజుకొనడానికి అవకాశాన్ని యిచ్చింది. యోవాబును తక్కినవారును అబ్నేరును సమీపించగా, యువ రక్తపాతంతో పనిలేదని అబ్నేరు యోవాబును ఒప్పించాడు. ఉభయ పక్షాలు యిండ్లకు తిరిగి వెళ్లారు.

యూదా గోత్రాన్ని ఉత్తరమునన్న గోత్రాల ఆధిపత్యం క్రిందికి తీసికొనిరావాలన్న అబ్నేరు ప్రయత్నం విఫలమయ్యింది ఎందుకంటే, దేవుడైన యెహోవా దావీదుతోనున్నాడు. 3:1లో మనం యిలా చదువుతాం: "సౌలు కుటుంబికులకును దావీదు కుటుంబికులకును బహుకాలము యుద్ధము జరుగగా దావీదు అంతకంతకు ప్రబలెను; సౌలు కుటుంబము అంతకంతకు నీరసిల్లెను."

ఐదున్నర సంవత్సరాల తరువాత, అబ్నేరు క్రొత్త పంథాను ఉపయోగించాడు: ఉత్తరపు గోత్రాలపై సౌలు కుమారులను సింహాసనం మీద కూర్చుండబెట్టాడు.[18]

> నేరు కుమారుడగు అబ్నేరు అను సౌలుయొక్క సైన్యాధిపతి సౌలు కుమారుడగు ఇష్బోషెతును మహనయీమునకు[19] తోడుకొని పోయి ... ఇశ్రాయేలువారిమీదను రాజుగా అతనికి పట్టాభిషేకము చేసెను. సౌలు కుమారుడగు ఇష్బోషెతు నలువదేండ్లవాడై యేలనారంభించి రెండు సంవత్సరములు పరిపాలించెను ... (2 సమూ. 2:8–10).

ఇష్బోషెతు[20] (లేక ఇష్బాల్ [21]) అనే పేరుగల కుమారుడు సౌలుకున్నట్టు తొలిసారిగా మనం చదువుతాం. యుద్ధ భూమిలో మరణించిన సౌలుయొక్క ముగ్గురు కుమారులకంటె ఇతడు చిన్నవాడిలా కన్పిస్తాడు.[22] గిల్బోవ పర్వతం మీద తన తండ్రియు, తన ముగ్గురు

అన్నలు వధింపబడినప్పుడు యితడెలాగో తప్పించుకున్నట్టున్నాడు, ఇష్బోషెతు బలహీనుడైన వ్యక్తి గనుక,[23] ఒకవేళ యుద్ధానికి వెళ్లియుండకపోవచ్చు.

ఇష్బోషెతు రెండు సంవత్సరాలు సింహాసనంపై కూర్చుండినా, బలం అబ్నేరు చేతిలో ఉన్నందున అతడు కేవలం కీలుబొమ్మలాగే ఉన్నాడు. దావీదు దేశాన్ని ఏకంగా చేయలేని చిక్కైన స్థితిగా నిరంతరం కొనసాగియుండేదే. అయితే వెంటనే బహు గొప్ప మార్పు జరిగింది. మానవ పరిస్థితుల్లో దేవుని హస్తం తిరిగి ప్రత్యక్షమయ్యింది లేక గోచరించింది. అతడు తన తండ్రియొక్క ఉంపుడు కత్తెలలో ఒక దానితో పోయినట్టు ఒకనాడు ఇష్బోషెతు అబ్నేరుపై నేరం మోపాడు.[24] రాజుయొక్క ఉంపుడుకత్తెల్లో ఒకదాన్ని కోరాడంటే, రాజ గృహమంతటిని కోరినట్టును, సింహాసనాన్నే కోరినట్టును లెక్కించబడింది. ఇష్బోషెతు అబ్నేరును రాజ ద్రోహిగా నిలదీశాడు. దానితో అబ్నేరు కోపావేశుడయ్యాడు.

> అబ్నేరును ఇష్బోషెతు అడిగిన మాటకు బహుగా కోపగించుకొని – నిన్ను దావీదు చేతికప్పగింపక నీ తండ్రియైన సౌలు ఇంటి వారికిని అతని సహోదరులకును ... ఈ వేళ ఉపకారము చేసిన నన్ను యూదావారికి చేరిన కుక్కతో సమానునిగా చేసి యీ దినమున ఒక స్త్రీనిబట్టి నామీద నేరము మోపుదువా? యెహోవా దావీదునకు ప్రమాణము చేసిన దానిని అతని పక్షమున నేను నెరవేర్చని యెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగజేయునుగాక; సౌలు ఇంటివారి వశము కాకుండా రాజ్యమును తప్పించి దాను మొదలుకొని బెయేర్షెబావరకు దావీదు సింహాసనమును ఇశ్రాయేలు వారిమీదను యూదా వారిమీదను నేను స్థిరపరచెదననెను (2 సమూ. 3:8–10; LB).

ఇష్బోషెతును సింహాసనం మీద కూర్చుండబెట్టడంలో అబ్నేరు అంతరించుతున్న ఉత్తర పాలస్తీనా నిరీక్షణను సజీవంగా నిలుటపుకై చేసిన నిరాశా ప్రయత్నమై ఉండవచ్చు. ఏదియెలాగున్నా, సౌలు కుమారుడే అతనికి విరోధంగా తిరిగాడు. అలా జరిగినప్పుడు అబ్నేరుయొక్క ప్రయత్నం విఫలమైనట్టుగా అబ్నేరు తలంచినట్టున్నాడు. చెడ్డ పరిస్థితులలో నుండి మేలైనదానిని రాబట్టాలని ఆ యుద్ధ వీరుడు ప్రయత్నించాడు. తాను దావీదుకు మద్దతు పలుకుతున్నట్టు అతనికి వర్తమానం పంపాడు.[25]

దావీదు ఎంత ఆశ్చర్యపోయి ఉంటాడో నీవు ఊహించగలవా? "దేవా, రోజు రోజుకి సహోదరుడు సహోదరుని సంహరించడం – ఎంతకాలం కొనసాగుతుంది?" ప్రతి సాయంకాలం దావీదు దేవునికి మొర్రపెట్టి యుండవచ్చు. అంతం సమీపించినప్పుడు, అబ్నేరునుండి సమాధానం కొరకు సందేశం వచ్చింది. ఇలాటిది దావీదు ఎన్నడే ఎదురు చూడలేదు. దేవుని మార్గములు ఆశ్చర్యమైనవి కావా?[26]

ఆబ్నేరు ప్రస్తావనకు[27] భద్రంగా దావీదు స్పందించాడు. అబ్నేరు దావీదు యొక్క రాజధాని నగరమైన హెబ్రోనుకు వచ్చాడు. సంవత్సరాల విరోధం తరువాత దావీదు అబ్నేరులు ముఖా ముఖిగా కలిసికున్నారు. సమాధానాన్ని వాంఛించిన దావీదు పరిస్థితిని దయగా చేపట్టాడు. అబ్నేరుకును అతనితో వచ్చిన వారికిని గొప్ప విందు చేయించి వారిని దావీదు విందుశాలకు నడిపించాడు.[28] బేరమాడే మేజాలకంటే, భోజనపు బల్లలవద్ద వ్యత్యాసాలను ఎక్కువగా కుదుర్చుకోవచ్చునని జ్ఞానంగల నాయకులు ఎరుగుదురు.

సమాధాన సంబంధమైన గోష్ఠి సక్రమంగా జరిగిపోయింది. కడకు అబ్నేరు దావీదుతో యిలా అన్నాడు: "-నేను పోయి ఇశ్రాయేలు వారినందరిని నా యేలినవాడవగు నీ పక్షమున సమకూర్చి, వారు నీతో నిబంధన చేయునట్లును, నీ చిత్తానుసారముగా నీవు రాజరికము వహించి కోరినదాని అంతటిమీద ఏలునట్లును చేయుదును" (3:21ఎ). వెంటనే అబ్నేరు ఉత్తర గోత్రీకులను సమాధానపరచడానికి వెళ్లాడు. "దావీదు అతనికి సెలవిచ్చి సమాధానంగా పంపాడు" (3:21బి; NEB). అనేక సంవత్సరాల చేదైన అంతరంగయుద్ధం తరువాత ఐకమత్యం దరిదాపుల్లో కనిపిస్తోంది.

మన దేశం భయంకరమైన అంతరంగ కలహంలో చిక్కుకొని పోయినప్పుడు దేశాన్ని ఏకం చేయాలనే భావాన్ని నొక్కి పలుకుతూ ప్రసిడెంట్ అబ్రాహాం లింకన్ ప్రభువైన యేసు మాటలను ఎత్తి చూపాడు: "ఒక రాజ్యము తనకు తానే విరోధముగా వేరుపడిన యెడల, ఆ రాజ్యము నిలువనేరదు ఒక యిల్లు తనకు తానే విరోధముగా వేరుపడిన యెడల, ఆ యిల్లు నిలువనేరదు" (మార్కు 3:24, 25). వేరుపడిన రాజ్యం నాశనం చేసే బీజాలను తనతో తీసికొని పోతున్నట్టు దావీదు ఎరిగినట్టే లింకన్ ఎరుగును. సమాజాల విషయంలో అది ఎంత సత్యమో దేశాల విషయంలో కూడ అది అంతే సత్యం. అది సమాజాల విషయం ఎంత సత్యమో స్థానిక సంఘాల విషయంలోను కుటుంబాల విషయంలో కూడా అది అంతే సత్యమైయుంటుంది. రాజకీయ నాయకులైనా, స్థానిక సంఘ నాయకులైనా, లేక కుటుంబ నాయకులైనా-దేవుని నాయకులుగా ఐక్యతను హెచ్చు ప్రాధాన్యతలో నిలపాలి.

## జ్ఞానంగల నాయకులు క్లిష్ట పరిస్థితులను చేపట్టగలరు (2 సమూ. 3:22-37)

ఇది కేవలం కట్టు కథయే అయ్యున్నట్టయితే, కొద్ది వారాలు ఉత్తర గోత్రాల్లో సంచరించి, ఇశ్రాయేలీయులందరిపై దావీదును రాజుగా చేయడానికి అబ్నేరు వారిని తోడుకొని వచ్చియుండేవాడే. జీవితం కట్టు కథ కాదు. పాత శత్రువుకు విందు చేసినంత సులభంగా సమాధానం రాదు. ఆ మార్గంలో గుండా పోవలసియుంటుంది. ఎదురు చూడని ఆటంకాలు అడ్డులు వస్తాయి. కొన్ని సార్లు తాను వెనుకకు వెళ్లి వేరొక మార్గంలో గుండా పోవలసియుంటుంది. ఎదురు చూడని వాటికొరకు నాయకులు కనిపెట్టాలి; అలాటివి తటస్థించినప్పుడు శీఘ్రమైన నిర్ణయాలు తీసికోవాలి.

2 సమూ. 3లో అబ్నేరు దావీదును దర్శించినప్పుడు యోవాబు అక్కడలేడని ఆ క్రింద కొన్ని వచనాలు తెలుపుతున్నాయి; యోవాబును అతని జనులును మరొక స్థలం మీదికి వెళ్లియున్నారు. (సమాధానకరమైన ఈ చర్చలు జరుగకుండ యోవాబు యొక్క ఉనికి చెడిపోతాయేమోనని, దావీదు కావాలని అతనిని పంపివేశాడా ఏమి అన్నట్టు అది ఉంది). అబ్నేరు వెళ్లిన కొద్ది సేపటికే యోవాబు తిరిగి వచ్చినట్టున్నాడు. "అబ్నేరుకు దావీదు స్వాగతం పలికి," సమాధానంగా పంపినట్టు యోవాబు వినినప్పుడు, అతడు దాన్ని భరించలేకపోయాడు. అతడు రాజువద్దకు వచ్చి, అబ్నేరు ఆలోచనలు దుష్టని

సంబంధమైనవని, ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని అబ్నేరును పట్టుకుని ఉండ వలసిందని యోవాబు అన్నాడు.

యోవాబు ఎప్పుడును దావీదు ప్రక్కలో ముల్లుగనే ఉన్నాడు.[29] ఒకవైపు అతడు మహా గొప్ప యుద్ధ శూరుడు, నిర్భయమైన నాయకుడై జనులను ఉత్సాహపరచినవాడు, రాజు కొరకు చావడానికైనా వెనుకాడనివాడు. మరోవైపు, స్వార్థపరుడు, పగతీర్చుకోవాలను కునేవాడు, తరచుగా అవిధేయుడు, ఆత్మ సంబంధమైన విలువలు ఎక్కువగా లేనివాడు.[30] నాయకులందరికి వారి యోవాబులుంటారు: వదలుకోలేని మనుష్యులు, వారితో ఉండలేం, వారు లేకుండా ఉండలేం. నీ యోవాబుల పట్ల నీ వైఖరి మీద నాయకుడుగా నీ విజయం ఆధారపడి యుంటుంది.

ఐక్యత సమీపంలోనికి రావడానికి ఏడు సంవత్సరాల కాలం పట్టింది. ఒక్క గంట సేపటిలో, కలిగిన పురోభివృద్ధియంతా యోవాబు నాశనం చేశాడు. యోవాబు దావీదును అప్పటికి కేవలం ఒకటో రెండో మైళ్లదూరం వెళ్లిన అబ్నేరును దావీదు తిరిగి చూడ రమ్మన్నట్టు వర్తమానం పంపాడు. ఏ విధమైన అనుమానం లేకుండగనే అబ్నేరు తిరిగి వచ్చాడు. "అతనితో ఏకాంతంగా మాట్లాడాలని" అతని కలుసుకున్న యోవాబు (3:27) దావీదు వర్తమానం కొరకు అబ్నేరు వేచియుండగా, అతని తమ్ముడగు ఆశాహేలును చంపినందుకు యోవాబు అతని కడుపులో పొడవగా, అతడు మరణించాడు.[31]

"హృదయం పగతీర్చుకోవాలని పరితపించినప్పుడు," దాని పర్యవసానాన్ని గూర్చి ఆలోచింపవలసి యుంటుందని ముందు పాఠంలో సూచించాం. యోవాబుకు పగ ఉంది; అయితే "దాని ఖరీదు అత్యధికమైయుంది." దావీదు అబ్నేరులు కలిసికున్నదానికంటే పరిస్థితి ధారుణంగా మారిపోయింది. సంభవించినదాని గూర్చి దావీదు విన్నప్పుడు, చంపడానికే అబ్నేరును హెబ్రోనుకు ఎరవేసి పిలిచినట్టు జనులు అనుకుంటారని అతనికి తెలిసిపోయింది. దావీదును నమ్మడానికి వీలులేదు అని జనులనుకుంటారు. పగతీర్చు కోవాలనే[32] యోవాబుయొక్క తృష్ణ ఉత్తర దక్షిణ భాగాలను ఏకం చేసే అవకాశాన్ని నాశనం చేసినట్టు కన్పించింది.

ఈలాటి సమయాల్లోనే నిజమైన నాయకత్వం బయటపడుతుంది. దైవికమైన గుణ లక్షణాలు అతడు కలిగి యుండడం మాత్రమే గాక, విపత్కరమైన పరిస్థితిలో దయగలిగి ప్రవర్తించగల సామర్థ్యం దావీదుకు ఉంది. వినాశకరమగు ఈ పరిస్థితిలో దావీదు యొక్క ప్రత్యుత్తరాన్ని బట్టి దేవుడు అతని ఎందుకు ఎన్నుకున్నాడో కనబడుతుంది.

మొదటిగా, అతడు వెంటనే స్పందించాడు. క్లిష్ట పరిస్థితుల్లో సమయం అతి ముఖ్యం. పరిస్థితులు మంచిగా అవుతాయని ఎదురు చూస్తూ మనలో అనేకమంది కాలాన్ని పొడిగిస్తూ ఉంటారు. పరిస్థితులు మంచిగా అవుతాయని మనలో అనేకులం ఎదురు చూస్తాం, అయితే అరుదుగా అలా జరుగుతుంది. నిజమైన నాయకులు తీర్మానాలతో స్పందిస్తారు.

రెండవదిగా, ఇట్టి ఘోరమైన కార్యంలో దావీదుకు వ్యక్తిగతమైన ఏ ప్రమేయము లేనట్టు వెంటనే వ్యక్తపరచాడు (3:28). అది అంతగా ప్రయోజనకరమయ్యింది కాకపోయినా, అది జరిగించవలసిన అవసరముంది.

మూడవదిగా, ఆ కార్యాన్ని బట్టి దావీదు యోవాబును బహిరంగంగా ఆక్షేపించాడు. సైన్యంలో అతనికున్న స్థానాన్ని రద్దుచేశాడు,[33] మరియు యోవాబును అతని యింటివారిని శాపం క్రింద నిలిపాడు. యోవాబు యొక్క శిక్ష ఎందుకు తీవ్రంగా ఉండలేదు అని మాత్రం ఆశ్చర్యపడవచ్చు. యోవాబును సంహరించినట్టయితే దావీదు సైన్యంలోనే[34] విభజన వచ్చియుండేదే. యోవాబు జరిగించింది సరియైన పనియని యూదాలో అనేకులు తలంచారనేది నిస్సందేహం. ఆ దినాల్లో శాపం, "తక్కువైన శిక్షగా" భావించబడలేదు. చివరిగా, శ్రమించి నేర్చుకున్న ఒక పాఠాన్ని దావీదు ఆచరణలో పెడుతున్నాడు: కొన్ని సంగతులు దేవుని చేతికి అప్పగించాలి. "అతడు జరిగించిన దుష్క్రియనుబట్టి యెహోవా కీడుచేసినవానికి ప్రతికీడు చేయును గాక" అని దావీదు ముగించుతాడు (3:39బి).

నాల్గవది, అతడు జాతీయ అంగలార్పు దినంగా దాన్ని ప్రకటించి, సగౌరవంగా అబ్నేరును హెబ్రోనులో సమాధి చేశాడు. దావీదు తన ప్రధానులను అబ్నేరు శవం వెంట నడిపించాడు. రాజ వస్త్రాలతో దానివెంట నడువలేదు. అందరు గోనెపట్ట కట్టుకోవాలని దావీదు ఆజ్ఞాపించాడు.[35] (కడకు యోవాబు సహితం అబ్నేరు గౌరవార్థం గోనెపట్ట కట్టుకోవలసి వస్తే, దానికి అతడు ఎంతగా బాధ చెందియుంటాడో!) సమాధి దగ్గర, దావీదు సాధారణమైన వస్త్రాలతో నిలిచి, సౌలు కొరకు ఎలా అతడు పాడాడో అబ్నేరు కొరకును అలాగే జరిగించాడు. దావీదు యొక్క కనికరంగల హృదయం, సమాధానం కొరకైన అతని వాంఛ మరోసారి ముందుకు వచ్చాయి. "–నేటిదినమున పడిపోయినవాడు ఇశ్రాయేలువారిలో ప్రధానుడనియు పెద్దలలో ఒకడనియు మీకు తెలిసేయున్నది" అని అతడన్నాడు (3:38).

అయిదవది, దావీదు నిజమైన విచారాన్ని వ్యక్తపరచాడు. అతడు ఏడ్వడం మాత్రమేగాక; సమాధి విందులో పాల్గొనడానికి అతడు యిష్టపడలేదు. ఈ దుఃఖాన్ని దావీదు రాజ్య సంబంధమైన సూచనగా కనుపరచలేదు. ముందో వెనుకో ఇలాటి మోసం (సహజంగా త్వరలోనే) బయటపడుతుందని దావీదు ఫిలిష్తీయాలో కనుగొన్నాడు. కడకు, అనుచరులు నడకగుండా చూస్తారు. అయితే యిక్కడ దుఃఖము నిజమైనదని; ఆ కాలంలో, ఆ గొప్ప మనిషి యొక్క హీనమైన మరణం విషయంలో హృదయ భగ్నమై యున్నాడని జనులకు నమ్మిక కలిగింది.

దావీదు యొక్క స్థిరమైన జ్ఞానయుక్తమైన ఈ కార్యాలకు వచ్చిన ఫలితమేమి? అబ్నేరు యొక్క మరణంలో దావీదుకు ఎలాటి పాలులేదనే విషయం ప్రజలు ఒప్పింపబడిన వారై దావీదు చేసిన వాటియందు వారు ఆనందించారు.

ప్రతి నాయకునికి ధైర్యమును జ్ఞానమును అవసరమై ఉంటాయి. దేవునికి సన్నిహితంగా ఎదుగుతూ ఉంటే ఈ రెండింటిని పొందగలరని దేవుని నాయకునికి తెలుసు. యెహోషువ గ్రంథం యిలా అంటుంది:

> అయితే నీవు నిబ్బరముగలిగి జాగ్రత్తపడి బహు ధైర్యముగానుండి ... ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడుచు ప్రతిమార్గమున చక్కగా ప్రవర్తించునట్లు నీవు దానినుండి కుడికిగాని యెడమకుగాని తొలగకూడదు. ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. ... నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని

> ధ్యానించినయెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు. ... నీవు నడచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును (యెహోషువ 1:7–9).

దేవ చిత్తాన్ని నేర్చుకొని దాని చొప్పున జీవించినట్లయితే జ్ఞానం వస్తుందని పాత నిబంధనలో మహా జ్ఞానియైనవాడన్నాడు.[36] "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను" అని యాకోబు అన్నాడు (యాకోబు 1:5).

బైబిలు పఠనము, ప్రార్థనల ద్వారా దేవుని వ్యక్తిగా, ఉద్దేశంగా మనలను మనం నింపుకుందాం. అప్పుడు, విపత్తులు ఏర్పడినప్పుడు ధైర్యంగా మనం కార్యాలను జరిగింపవచ్చు.

## జ్ఞానంగల నాయకులు తమ బలహీనతలను గూర్చి కపటం లేక యుంటారు (2 సమూ. 3:38, 39)

దావీదు ప్రజలను ఆనందింపజేసే మరో పని చేశాడు. తన పొరపాట్లను అతడు గుర్తించాడు. 3:38, 39ని గమనించు: "పిమ్మట రాజు తన సేవకులను పిలిచి వారితో ఈలాగు సెలవిచ్చెను. ... పట్టాభిషేకము నొందినవాడనైనను, నేడు నేను బలహీనుడనైతిని. సెరూయా కుమారులైన యీ మనుష్యులు (అంటే, యోవాబును అతని సహోదరులును) నా కంటే బలముగలవారు." అబ్నేరు మరణంలో దావీదుకు ఏలాటి జోక్యం లేదని తెలిపినా, ఒక విధంగా తన సేవకుల పనికి తాను బాధ్యుడన్న సంగతి తనకు తెలుసు. "నేనుండవలసినంత బలముగల నాయకుడనై ఉండినట్టయితే, యోవాబును అతనితో కూడ కుట్ర పన్నినవారును ఈలాటి కార్యం జరిగించడానికి తెగించకపోయెడివారే"నని దావీదు అంటున్నాడు.

కార్యాలు తప్పుగా జరిగినప్పుడు, యితరుల మీద ఆ నేరము నెట్టప్రయత్నించక, తమవంతు దోషాన్ని తాము అంగీకరించే నాయకులను నేను అభినందిస్తాను. గెలువవలసిన ఆట ఓడినప్పుడు, కోచ్‌గాని, తన క్రిందనున్న వారివలన తప్పు సమాచారం అందినందున పొరపాటుగా జరిగించిన రాజకీయ నాయకుడేగాని, లేక సమస్యలున్న స్థానిక సంఘపు పెద్దలేగాని వారి వంతులో తప్పును వారు అంగీకరించవలసి యుంటుంది. నిజంగా తప్పులో ఉండి తన బాధ్యతను అంగీకరించని వానికంటె, తన తప్పును నిష్కపటంగా అంగీకరించేవానికి రెండో తరుణాన్ని యివ్వడానికి, సహజంగా ప్రజలు అంగీకరిస్తారు.

తన హద్దులను తాను అంగీకరించినప్పుడు, దావీదుపై తన అనుచరులకు గౌరవం తగ్గలేదు; సరిగదా, అతడు వారి గౌరవాన్ని చూరగొన్నాడు. పౌలు 2 కొరింథీ. 12:9, 10లో దాఖలు చేసిన స్వభావాన్ని దావీదు తనయందు నిలుపుకున్నాడు:

> [దేవుడు]–నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణ మగుచున్నదని ఆయన నాతో చెప్పెను. కాగా (దేవుని) శక్తి నామీద నిలిచియుండు నిమిత్తము,

విశేషముగా నా బలహీనతలయందే బహు సంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను.

తన లోపాలను అంగీకరించలేనివాడు భద్రతలేని నాయకుడు. నిజమైన నాయకులైతే తమ బలహీనతలను అంగీకరిస్తూ, తమ లోపాలను గుర్తించుతూ, తమ తప్పులను ఒప్పుకొనగలుగునంత గొప్పవారై యుంటారు.

## ఆటంకములు కలిగినప్పుడు సహితం జ్ఞానంగల నాయకులు ధైర్యంగా నిలిచి యుంటారు

## (2 సమూ. 4:1-5:5; 1 దినవృ. 11:1-3; 12:23-40)

అబ్నేరు యొక్క హత్య విపత్తును దావీదు నివారించిన తోడనే, అంతకంటె మించిన ఆపద ద్విజ్మండలములో వచ్చి నిలిచింది. ఇష్బోషెతు సైన్యంలో సైన్యాధిపతులుగా ఉండిన యిద్దరు సహోదరులు, అబ్నేరు మరణ గాధను విని, దావీదు దయను పొందడానికి గాను ఒక ఘోరమైన పన్నాగాన్ని పన్నారు.[37] వారు మధ్యాహ్నపు నిద్రవేళ ఇష్బోషెతు యింట ప్రవేశించారు.[38] వారు ధైర్యంగా రాజు పడక గదిలోనికి వెళ్లి అతని సంహరించారు. అతని తలను తెగనరికి, దావీదును కలిసికొనడానికి వారు ఆ రాత్రియంతా ప్రయాణం చేశారు.

ఇష్బోషెతు తలను చేతపట్టుకొని దావీదు గుమ్మము వద్ద వారు నిలిచినప్పుడు, ఇశ్రాయేలీయులందరి మీద త్వరలోనే రాజు కాబోయేవానిని వారు అపార్థం చేసికొన్నట్టు కనుగొన్నారు. మరోసారి వెంటనే కార్యం జరిగించవలసిన అవసరం ఏర్పడింది. లేకుంటే ఆ కుట్రలో దావీదుకు పాలున్నదన్న తప్పుడు సందేశం త్వరగా వ్యాపిస్తుంది. సౌలును చంపినట్టు చెప్పుకొన్న అమాలేకీయునికి ఏ శిక్ష విధింపబడిందో దావీదు ఆ యిద్దరు సహోదరులకు గుర్తు చేశాడు: “కావున దుర్మార్గులైన మీరు ఇష్బోషెతు ఇంటిలో చొరబడి, అతని మంచము మీదనే నిర్దోషియగువానిని[39] చంపినప్పుడు మీచేత అతని ప్రాణదోషము విచారింపక పోవుదునా? లోకములో ఉండకుండ నేను మిమ్మును తీసివేయక మానుదునా?” అని అన్నాడు (2 సమూ. 4:11).

అతడు ఆ యిద్దరు మనుష్యులకు మరణ శిక్ష విధించి, వారి కాళ్లు చేతులు నరికించి, వారి దేహాలను బహిరంగ స్థలంలో వ్రేలాడ దీయించాడు. దావీదు దీనితో రెండు విధాలైన సందేశాన్ని పంపుతున్నాడు: (1) సామెతలు 6:16–19లోని సాధారణ సందేశం – “నిరపరాధులను చంపు చేతులను,” “కీడు చేయుటకు త్వరపడి పరుగెత్తు పాదములను” యెహోవాకు హేయములు; మరియు (2) దేవుని అభిషిక్తుడుగా, అబద్ధాన్ని, మోసాన్ని తాను సహించదనియు, అతిక్రమించిన వారు త్వరగా శిక్షింపబడక పోరనియు ప్రత్యేకించిన సందేశాన్ని పంపాడు.

అబ్నేరు సమాధిలో ఇష్బోషేతు తలను దావీదు మర్యాదగా పాతి పెట్టాడు. సౌలు కుటుంబానికి అది కడపటి వందన వచనం.

"అది అయ్యేవరకు అది కానట్టే" అని బేస్‌బాల్ ఆటలో గొప్పవాడైన యోగి బెర్రా అన్నట్టు తరచుగా అంటారు. ఈ సామ్యం నిజమేనని ప్రతి నాయకునికి తెలుసు. ఒక కష్టాన్ని వెనుక ద్వారానికి నెట్టి వేయగలిగి నిన్ను నీవు అభినందించుకొను నంతలో, నీ యెదుటి ద్వారం వద్ద అంతకు మించింది నిలిచి తట్టుతుంది. ప్రఖ్యాతి గాంచిన "మర్ఫీలా" –"ఏది తప్పు కాగలదో అది తప్పోతుంది" అని అంటుంది. నాయకులకు మర్ఫీ ప్రత్యేకమైన చట్టం కలిగియుంది: "ఏది తప్పు కాగలదో, అది తప్పోతూ–వెయ్యి సార్లు హెచ్చింప బడుతుంది."

ఏది ఎటుపోయినా, నిజమైన నాయకులు నిశ్చయంగా ఉండగలరు. అంతిమ విజయాన్ని గూర్చి నమ్మిక కలిగియుంటారు. దేవుడు తమ పక్షమున ఉన్నాడని ఎరిగిన దేవుని నాయకుల విషయంలో విశేషంగా యిది నిజమై యుంటుంది.[40]

దావీదు సమూయేలుచే అభిషేకింపబడిన నాటనుండి, యిరువది సంవత్సరాలుగా జీవితం ఒక సవాలు తరువాత మరో సవాలును ఎదుర్కొంటునే ఉంది! అయినా దావీదు వదలుకోలేదు. ఆలాటి విశ్వాస్యతకు దేవుడు బహుమానమిస్తాడు. 5వ అధ్యాయం మొదటి భాగంలో యిందు విషయమై యిలా చదువుతాం:

> ఇశ్రాయేలువారి సకల గోత్రములవారు హెబ్రోనులో దావీదునొద్దకు వచ్చి – చిత్తగించుము; మేము నీ ఎముకనంటినవారము రక్తసంబంధులము; పూర్వ కాలమున సౌలు మామీద రాజైయుండగా నీవు ఇశ్రాయేలీయులను నడిపించువాడవై ఉంటివి. అయితే ఇప్పుడు–నీవు ఇశ్రాయేలీయులనునట్టి నా జనులను పాలించి వారిమీద అధిపతివై యుందువని యెహోవా నిన్నుగురించి సెలవిచ్చియున్నాడని చెప్పిరి. మరియు ఇశ్రాయేలువారి పెద్దలందరు హెబ్రోనులో రాజునొద్దకు రాగా రాజైన దావీదు హెబ్రోనులో యెహోవా సన్నిధిని వారితో నిబంధన చేసెను గనుక ఇశ్రాయేలువారిమీద రాజగుటకై వారు దావీదునకు పట్టాభిషేకము చేసిరి[41] (1–3 వచనాలు).

దావీదు వద్దకు పెద్దలు వచ్చినప్పుడు, "సౌలుయొక్క రాజ్యమును దావీదుతట్టు త్రిప్పవలెనన్న ప్రయత్నముతో యుద్ధమునకు ఆయుధములను ధరించి అతనియొద్దకు" అధిపతులు వచ్చిరని 1 దినవృత్తాంతముల రచయిత అన్నాడు (12:23). "ఇశ్రాయేలులో కడమ వారందరును ఏకమనస్కులై దావీదును రాజుగా నియమింపవలెనని కోరియుండిరి" (38 వ.; NIV). సైనికులుగా ప్రాతినిధ్యం యిచ్చినవారి సంఖ్య 3, 40, 000![42] మూడు దినములు జరిగిన మహా గొప్ప విందుకు కావలసిన ఆహార వస్తువులను వారు తెచ్చి యుండిరి! "ఇశ్రాయేలీయులకు సంతోషము కలిగియుండెను" (1 దినవృ. 12:40ఎ).

తన జీవితపు కర్తవ్యాన్ని లేక పనిని జరిగించడానికి దావీదు చివరిగా సిద్ధపడినవాడై ఉన్నాడు. దానికొరకు అతడు ముప్పది ఏడు సంవత్సరాలు సిద్ధపడుతూ వచ్చాడు!

> దావీదు ముప్పది యేండ్లవాడై యేల నారంభించి నలువది సంవత్సరములు పరిపాలన చేసెను. హెబ్రోనులో అతడు యూదా వారందరిమీద ఏడు సంవత్సరములు ఆరు మాసములు, యెరూషలేములో ఇశ్రాయేలు యూదాల వారందరి మీద ముప్పది మూడు సంవత్సరములు పరిపాలన చేసెను (2 సమూ. 5:4, 5).

## పదవిగాక బాధ్యతయే తమకున్నట్టు జ్ఞానముగల నాయకులు అర్థంచేసుకుంటారు (2 సమూ. 5:6-10; 1 దినవృ. 11:4-9)

మరలా, ఇదిఒక కట్టుకథ అయ్యున్నట్టయితే, "అప్పటినుండి వారెల్లప్పుడు సంతోషముగానుండిరి" అని చెప్పడానికి సరిపోయి ఉండేదే. అయితే యిది కట్టు కథ కాదు. ఇది నిజ జీవిత గాథ. దావీదు పన్నెండు గోత్రాల మీద రాజుగా చేయబడినప్పుడు, అతని పని అప్పుడే ప్రారంభమయ్యింది. నీవు ఒక గమ్యాన్ని చేరుకున్నప్పుడు, క్రొత్త సమస్యల అమరికను చేరుకుంటావని చెప్పబడింది.

సాధించిన ఐక్యతను మొదటిగా దావీదు స్థిరం చేయవలసి యుంది. క్రొత్తగా జన్మించిన శిశువు ఎంత స్థిరమైన రక్షణ లేనిదిగా, ప్రతి యిబ్బందికి లోనైయ్యేదిగా, ఎల్లప్పుడు మరణానికి కొంచెం దూరంలోనే ఉన్నట్టు ఉంటుందో, క్రొత్తగా సాధించిన ఐక్యత కూడ అలాగే ఉంటుంది. దావీదు బహు ధైర్యమైన జ్ఞానయుక్తమైన కార్యం చేయబూనాడు. యెరూషలేమును పట్టుకొని దానిని తన రాజధాని నగరంగాను, దేశానికి కేంద్రంగాను, ఇశ్రాయేలీయుల ఆత్మ సంబంధమైన కేంద్రంగాను చేయబూనాడు.

యెరూషలేము ప్రాచీన పట్టణమైయుండి, ఆ దేశంలోని బహుగా ఎత్తయిన స్థలంలో నిర్మింపబడింది. అబ్రాహాము కాలంలోనే అది రాజ నగరు, మెల్కీసెదెకు దాని రాజు.[43] యెరూషలేము సమీపముననే మోరియా పర్వతముంది. అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించ వెళ్లింది అక్కడికే. యెహోషువ ఆ దేశంలోని సైన్యంతో ప్రవేశించినప్పుడు, అతడు యెరూషలేము రాజును సంహరించాడు[44] కాని అతడు ఆ పట్టణాన్ని వశపరచుకోలేకపోయాడు.[45] సంవత్సరాలలో అనేకులు దాన్ని పట్టుకో వాలనుకొని విఫలులయ్యారు.[46] మూడువైపుల లోతైన లోయలపై, ఎత్తుగా హెచ్చింపబడిన యెరూషలేము చొరబడడానికి వీలుకాని స్థితిలో ఇశ్రాయేలు కేంద్ర భాగంలో నాలుగు వందల ఏండ్లు అలవికాకయే నిలిచియుంది. యెరూషలేమును జయించుటవలన దావీదు తన శక్తిని ఐక్యతను ప్రదర్శించబోతాడు. ఒక్కరే ఎన్నడు సాధించలేనిది, ఇశ్రాయేలు ఏకంగా కలిసి పని చేయడంవలన సాధించగలుగుతోంది. యూదా బెన్యామీను గోత్రాలకు మధ్య యెరూషలేము తటస్థంగా ఉన్నందున, తన పరిపాలనలో దావీదు పక్షపాతం చూపడని తెలియవస్తుంది.

యెరూషలేమును పట్టుకొనడం చెప్పడంకంటె చేయడం కష్టం. దావీదును అతని సైన్యమును పట్టణం మీదికి వెళ్లినప్పుడు, ఆ కోటను ఆక్రమించుకొనియున్న యెబూసీయులు,[47] అవమానాలను కురిపించారు. "మీరెన్నడు యిక్కడికి రాలేరు" అని వారు కేకలు వేశారు! కేవలం గుడ్డివారు, "వికలాంగులు సహితం మిమ్మును వెలుపల ఉంచగలరు" అని వారన్నారు.[48] ఏదియెలాగున్నా, పట్టణపు భద్రతలో ఉన్న లొసుగు దావీదుకు తెలుసు. పట్టణపు వెలుపటి గోడలనుండి వచ్చే నీటి ఊట పట్టణపు మధ్యనుండి బావిలోనికి వస్తూ ఉంటుంది. తొలువబడిన గోడగుండా లోతైన బావి మీదుగా ఎక్కాలి: "ఎవడు మొదట యెబూసీయులను హతము చేయునో వాడు ముఖ్యుడును సైన్యాధిపతి

యగునని దావీదు" సెలవిచ్చాడు (1 దినవృ. 11:6). సంకోచింపకుండ, యోవాబు ఆ చన్నీటిలో దూకి అతడును అతని మనుష్యులును చీకటిగల సందులోనికి వచ్చారు. కొద్ది సమయంలోనే, యెరూషలేములో దావీదు సైన్యం చేతిలోను యోవాబు చేతిలోను పడింది. భయములేని దావీదు యొక్క యుద్ధ వీరుడు, గొప్ప ధర్మ సంకటం కలిగించినవాడైన యోవాబు తిరిగి అతని సైన్యాధిపతిగా నిలిచాడు. (నీ యోవాబులను వదలుకొనడం కష్టం!)

దావీదు యెరూషలేమును తన రాజధాని నగరుగా చేసికొని, తన సరిహద్దులను విశాలపరచుకో నారంభించాడు.[49] త్వరలోనే అది "దావీదు పట్టణమనబడింది." దినాలు గడిచేకొద్ది, "దావీదు అంతకంతకు వర్ధిల్లెను. సైన్యములకధిపతియగు యెహోవా అతనికి తోడుగా ఉండెను" (2 సమూ. 5:10).

2 సమూ. 5:11లోని గమనిక దావీదు యొక్క విజయాన్ని నొక్కి పలుకుతుంది: "తూరు రాజగు హీరాము, దూతలను దేవదారు మ్రానులను వడ్రంగులను కాసెపనివారిని పంపగా వారు దావీదు కొరకు ఒక నగరిని కట్టిరి." ఫోనీషియాలో తూరు ఒక ప్రాముఖ్య మైన ఓడరేవు. అది ఇశ్రాయేలుకు ఉత్తరాన ఉంది. దావీదు యొక్క క్రొత్త అంతస్థును అంగీకరించిన పరదేశపు అధికారియైన హీరాము యొక్క బహుమానం ప్రధానమైనది.

హీరాము ఔదార్యం దావీదును ఆనందింపజేసింది. "ఇశ్రాయేలీయులమీద యెహోవా తన్ను రాజుగా స్థిరపరచెననియు, ఇశ్రాయేలీయులనుబట్టి ఆయన జనుల నిమిత్తము, రాజ్యము ప్రబలము చేయుననియు దావీదు గ్రహించెను" (2 సమూ. 5:12). ఏదో ఒక ప్రత్యేకమైన కార్యం జరిగింది, "ఇది నిజమా?" అని నీవు ఆశ్చర్యపోతున్నావు. అలాటి ఒక దానిని దావీదు అనుభవించుతున్నట్టు కన్పిస్తాడు. దేవుని వాగ్దానాల నెరవేర్పు యొక్క చర్యలవలన స్థిరపరచబడ్డాయి.

హీరాము యొక్క దయ మరో సత్యాన్ని దావీదుకు గ్రహింపజేసింది. "దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయుల నిమిత్తము అతని రాజ్యాన్ని హెచ్చించినట్టు దావీదు గ్రహించాడు." దీన్ని నీ మనస్సులో ఉంచుకో: అది దావీదు కొరకు కాదు సుమీ, "తన ప్రజలైన ఇశ్రాయేలీయుల నిమిత్తము." నాయకత్వపు ఉద్దేశం తమ స్వంత యిష్టాన్ని నెరవేర్చు కొనడానికి, తమ కోర్కెలతో ఆటలాడడానికి, తమకు అనుకూలమైనట్టు పరిస్థితులను మల్చుకొనడానికని అనేకులు ఆలోచిస్తారు. దావీదుకు తనకనే ప్రణాళిక ఏదీలేదు, అది దేవునిదే. తాను జరిగించేది ఏదైనా దేవుని ప్రజలకొరకే.

నాయకత్వం పదవి కాదు, అది బాధ్యతయే. దావీదుకున్న బాధ్యతను గుర్తించడం కష్టం. నేడు మనం దానితో పోల్చడానికి ఏదీలేదు. ప్రజలయొక్క ఆర్థిక రాజకీయ పరిస్థితులు మాత్రమే గాక వారి ఆత్మ సంబంధమైన పరిస్థితులయందును అతడు అక్కరగలవాడై యుండాలి. ప్రసిడెంట్ యొక్క బలీయమైన బాధ్యతను గూర్చి ఆలోచించు. ప్రభువు సంఘంలో పెద్దలకున్న భారమైన బాధ్యతలను గూర్చి ఆలోచించు[50] అటు ప్రసిడెంట్ యొక్క పని, యిటు కొన్ని లక్షలమంది సంఘ సభ్యులున్న పెద్దలయొక్క పని కలిస్తే ఎంతో ఆలోచించు! దావీదు ఎదుర్కొంటున్న పని యొక్క భారం అలాటిదై యుంటుంది.

తమ్మును తాము అనుభవించడానికి కాక, యితరులకు సేవ చేయడానికి నాయకులు తమ స్థితికి వచ్చినట్టు గుర్తించాలి. ఏ ప్రజలకు వారు సేవ చేస్తున్నారో ఆ ప్రజలయొక్క నైతిక ఆత్మ సంబంధమైన యోగ క్షేమాలు ఆలోచించే బాధ్యత ఉన్నట్టు నాయకులు ప్రధానంగా గుర్తించాలి. అనేకులు దాన్ని గుర్తించక పోవడం దురదృష్టకరం.

## జ్ఞానముగల నాయకులు తమ అనుచరుల క్షేమమును గూర్చి అక్కర కలిగి ఉంటారు (2 సమూ. 5:17-25; 1 దినవృ. 14:8-16)

ఉత్తరమందున్న గోత్రముల పెద్దలతో గతంలో అబ్నేరు చేసిన గోష్టిలో, "–నా సేవకుడైన దావీదుచేత నా జనులగు ఇశ్రాయేలీయులను 'ఫిలిష్తీయుల చేతిలోనుండియు, వారి శత్రువులందరి చేతిలోనుండియు విమోచించెదనని యెహోవా దావీదునుగూర్చి సెలవిచ్చియున్నాడు' " (2 సమూ. 3:18).[51] ఈ వాగ్దాన విషయములో నూతనంగా అభిషేకింపబడిన రాజు పరీక్షింపబడ్డాడు. "జనుల ఇశ్రాయేలీయులమీద రాజుగా దావీదునకు పట్టాభిషేకము చేసిరని ఫిలిష్తీయులకు వినబడినప్పుడు దావీదును పట్టుకొనుటకై ఫిలిష్తీయులందరు వచ్చిరి" (2 సమూ. 5:17). ఎంతకాలం దేశము విభాగింపబడియుందో, ఎంతకాలం దావీదు యూదావారిమీద రాజుగా ఉన్నాడో, అంత కాలం, అతనివలన హాని కలుగనేరదని ఫిలిష్తీయులు తలంచారు. అయితే దావీదు క్రింద ఇశ్రాయేలీయులందరు ఏకమయ్యారు, 3,00,000 మంది సైనికులు అతని స్వాధీనంలో వచ్చినట్టు వారికి తెలియగానే అతడు తన భద్రతను కట్టుదిట్టం చేసికొనక ముందే అతని లయపరచాలని ఫిలిష్తీయులు భావించారు.

దోచుకుందామని దాడిచేసే పక్షం వారి పని కాదు. ఇది అందరితో కూడిన యుద్ధం. సౌలు చంపబడిన యుద్ధంలాంటిది యిది. "ఫిలిష్తీయులందరు దావీదును వెదకుటకు బయలువెళ్లిరి." "వారు అతనిని వెతుకుటకు తమ బలమంతటితో కూడి వెళ్ళిరి" అని NIV అంటుంది. వారు ఫిలిష్తీయానుండి బయలుదేరి అడ్డం వచ్చిన వారిని చంపుకొంటూ దోచుకొంటూ యెరూషలేమునకు కొన్ని మైళ్ల దూరంలో ఉన్న రెఫాయీము లోయవరకు సాగివచ్చారు.[52]

క్రిందనున్న లోయలో శత్రువులు విస్తరించియున్న సంగతి దావీదు చూచినప్పుడు, ఇశ్రాయేలు యొక్క అసలైన రాజువద్దకు వెళ్లి, "నేను ఫిలిష్తీయుల మీదికి పోవుదునా?" అని దేవుని వద్ద విచారణ చేయగా, "నీవు వెళ్లుము ఫిలిష్తీయులను నీ చేతికి అప్పగించియున్నానని" ఆయన అతనికి సెలవిచ్చాడు (2 సమూ. 5:19). దేవుని సేనగా అనేక సంవత్సరాల తరువాత కన్పించిన ఆ సైనికులను దావీదు ఫిలిష్తీయులకు విరోధంగా యుద్ధానికి నడిపించాడు, వారిని జయించాడు. "యెహోవా నా శత్రువులను నా యెదుట నిలువకుండ నాశనము చేసెననుకొని ఆ స్థలమునకు (ప్రవాసముల స్థలము) బయల్పెరాజీమను పేరుపెట్టెను" (2 సమూ. 5:20). "గొప్పసాధనకు" ప్రభువు అని దాని అర్థం.

తన నాయకత్వం కొరకు కనిపెట్టేవారిని కాపాడడం, భద్రపరచడం నాయకుని గొప్ప బాధ్యతలలో ఒకటైయుంది. కొన్నిసార్లు నాశనం చేసే ఎదుర్కోళ్లు విదితమై యుంటాయి; కొన్ని సార్లు అవి అంతగా తెలియనట్టుంటాయి. కొన్ని సార్లు అవి వెలుపటినుండి వస్తాయి, తరచుగా లోపలినుండే వస్తాయి.[53] జ్ఞానముగల నాయకుడు యిట్టి ఆపదల విషయములో మెలకువగానుండి, జ్ఞానయుక్తంగా వాటిని ఎదుర్కోవలసి యుంటుంది. దావీదువలె, జ్ఞానముగల నాయకుడు క్లిష్ట పరిస్థితులలో సహాయానికిని నడిపింపుకును దేవుని వద్దకు వెళ్తాడు.

సమస్యలను పరిష్కరించుతున్నప్పుడు, అవి అంతర్ధానమై పోతాయి. మరి యిక ఎన్నడును రావు అనే భావనతో సహజంగా జ్ఞానముగల నాయకులు యోచింపరు. ఫిలిష్తీయులు తిరిగి వచ్చారు. దావీదు యొక్క విజయముతో తల్లడిల్లి ఫిలిష్తీయులు మరి ఎక్కువైన సైన్యసమూహముతో రెఫాయీము లోయలో దిగారు.[54] దావీదు తిరిగి దేవుడైన యెహోవా వద్దకు వెళ్లాడు. తన శత్రువునకు వెనుక చుట్టుముట్టి దేవుని గురుతు కొరకు కనిపెట్టిఉండుమని ఆయన అతనికి తెలియజేశాడు. "యెహోవా – నీవు వెళ్లవద్దు – చుట్టు తిరిగిపోయి, కంబళిచెట్లకు[55] ఎదురుగా వారిమీద పడుము. కంబళిచెట్ల కొనలను చప్పుడు వినగానే ఫిలిష్తీయులను హతము చేయుటకై యెహోవా బయలుదేరు చున్నాడు గనుక అప్పుడే నీవు త్వరగా బయలుదేరవలెనని సెలవిచ్చెను" (2 సమూ. 5:24). మరోసారి దావీదు దేవుని ఆజ్ఞను వెంబడించాడు. ఈసారి దావీదును అతని సైన్యమును శత్రువును తన స్వదేశానికి తరిమారు "ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయుల సైన్యమును గిబియోను మొదలుకొని గాజెరువరకు తరిమి హతము చేసిరి" (1 దినవృ. 14:16). ఈ స్థిరమైన విజయము ఫిలిష్తీయుల ఉత్సాహాన్ని విరిచివేసింది. అప్పుడప్పుడు, ఫిలిష్తీయులు ఇబ్బందులు కలిగిస్తున్నా, వారు ఇశ్రాయేలీయులకు తీవ్రమైన బెదురుగా మిగిలియుండలేదు.

దావీదు జీవితంలో జరిగిన వందలకొలది యుద్ధాల్లో ఈ చిన్న రెండు సంఘర్షణలు (9 వచనాల్లో), రెండు యుద్ధాలుగా లెక్కింపబడతాయి. ఏదియెలాగున్నా, ఈ యుద్ధ విజయాలు – దావీదును దేవుడు రాజుగా స్థిరపరచాడని ఆయన అతని పరిపాలనను ఆశీర్వదిస్తాడని గుర్తుగా నిలిచాయి. చరిత్ర నిర్మాణంలో (లేక పురోభివృద్ధిలో) ఉంది. వందల సంవత్సరాల తరువాత, దేవుడు దుష్టుని శిక్షిస్తాడంటూ, యెషయా యిలా వ్రాశాడు:

> నిజముగా తన కార్యమును తన ఆశ్చర్యమైన కార్యమును చేయుటకు
> అపూర్వమైన తన కార్యము నొనరించుటకు
> ఆయన పెరాజీము అను కొండమీద లేచినట్లు
> యెహోవా లేచును
> గిబియోను లోయలో ఆయన రేగినట్లు రేగును (యెషయా 28:21).

ఈ విజయాలవలన వచ్చిన ఫలితాలను గూర్చి 1 దినవృ. 14:17 తెలియజేస్తుంది: "దావీదు కీర్తి ఇశ్రాయేలీయుల ప్రదేశములందంతట ప్రసిద్ధియాయెను; యెహోవా అతని భయము అన్యజనులకందరికి కలుగజేసెను."

ప్రతి సమస్యను తీవ్రంగా తీసికోవాలన్న సంగతి జ్ఞానముగల నాయకులకు తెలుసు. మనం సవాలును ఎదుర్కునేటప్పుడు వాటి ఫలితాలు ఎంత దీర్ఘంగా ఉండబోతాయో మనం ఎన్నడూ ఎరుగలేం.

## జ్ఞానముగల నాయకులు పొగడ్తలో ధారాళంగా ఉంటారు

## (2 సమూ. 23:8-39; 1 దినవృ. 11:10-12:38)

దావీదు ఫిలిష్తీయులను ఒంటరిగా ఎదుర్కొనలేదు. వ్యక్తిగతంగా దేవుడు తనతో ఉన్నంత మాత్రానే అతడు యుద్ధాలను జయించలేదు. తన చుట్టును సామర్థ్యంగల యుద్ధ శూరులను దేవుడు సమకూర్చినందున అతడు జయించగలిగాడు. ఎవరికి కీర్తి యివ్వాలో వారికి కీర్తి యివ్వాలనే విషయాన్ని దావీదు గుర్తించాడు. దావీదు పరిపాలన ముగించపోతుండగా వారు (దావీదు యొక్క "బలాఢ్యులు"[56]) 2 సమూ. 23లో పేర్కొనబడ్డారు. దావీదు యొక్క పరిపాలన ఆరంభమందు 1 దినవృత్తాంతం 11, 12 అధ్యాయాల్లో వారు పేర్కొనబడ్డారు. రెండవ సమూయేలు గ్రంథము 37 మంది మనుష్యులను పేర్కొంటుంది ఆలోచించు. ఈ పేర్లు మొదట్లో ఎలా వచ్చి ఉంటాయని తలంచుతావు? రాజైన దావీదు వాటిని దాఖలు చేయించి ఉంటాడు. గొప్ప పరాక్రమశాలుల యొక్క జాబితా అతడు కలిగియున్నాడు. వారు చేసిన దానిని అతడు అభినందించాడు. వారిని వారు చేసిన కార్యాలను రాబోవు తరములవారు తెలిసికోవాలని అతడు కోరియున్నాడు

జ్ఞానంగల నాయకులు – ఇంటిలోనే గాని, స్థానిక సంఘంలోనే గాని మరి యింకా ఎక్కడేగాని – ఎక్కడ గుర్తింపు అవసరమో అక్కడ గుర్తింపు నివ్వవలసిన ప్రాముఖ్యతను ఎరిగియుంటారు. వేషధారణతో కూడిన ముఖ స్తుతి చేయడం అని నా భావన కాదు, మంచిగా చేసిన పనిని మెచ్చుకొనడం అవసరమని నేనంటున్నా, పౌలు యిలా అన్నాడు: "కాబట్టి ... ఎవనియెడల సన్మానముండవలెనో వానియెడల సన్మానమును కలిగియుండి, అందరికిని వారి వారి ఋణములను తీర్చుడి" (రోమా 13:7). జ్ఞానముగల నాయకులు పొగడ్తలోను అభినందించడంలోను ధారాళంగా ఉంటారు. జ్ఞానముగల నాయకులు మొదటిగా దేవునికిని, తరువాత కష్టించి పని చేసినవారికిని ఘనతనిస్తారు. "ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" అనే విషయాన్ని వారు ఎరిగి యుంటారు (రోమా 12:10).

## జ్ఞానముగల నాయకులు కుటుంబం యొక్క ప్రాముఖ్యతను తగ్గించరు

## (2 సమూ. 3:2-5, 12-16; 5:13-16; 1 దినవృ. 14:3-7)

దావీదు యొక్క కుటుంబం లేఖన భాగాల్లో అక్కడక్కడ చెదురుమదురుగా కన్పించినా, వాటిని మనం అలక్ష్యం చేయకూడదు. దావీదు కుటుంబం తనతో జీవించడానికి

హెబ్రోనుకు వచ్చినట్టు 2 సమూ. 2:2లో మనం చూస్తాం. 2 సమూ. 3:1-5లో, "దావీదు అంతకంతకు వర్ధిల్లెను" అన్న విషయం మనకు చెప్పబడిన తరువాత, మనకు రుజువు యివ్వబడింది: "హెబ్రోనులో దావీదుకు పుట్టిన కుమారులు ..."[57] దావీదు తన రాజధాని నగరును యెరూషలేమునకు తరలించిన తరువాత, అతని కుటుంబ పురోభివృద్ధిని గూర్చి తెలుపబడింది. "దావీదుకు ఎక్కువ మంది కుమారులు కుమార్తెలు కలిగారు" (2 సమూ. 5:13; 1 దినవృ. 14:3 కూడా చూడు).[58] దావీదు కుటుంబం ముఖ్యమైయున్నట్టు దైవ ప్రేరేపితులైన లేఖకులు భావించినట్టున్నారు.

కుటుంబాలు నాయకులను చేయవచ్చు తుంచివేయవచ్చు. దావీదు తన రాచ కార్యాలలో మునిగిపోయి తన కుటుంబాన్ని[59] అశ్రద్ధ చేసినట్టు మనం చూడబోతాం - దానికి తగిన రుసుము చెల్లించుకోవలసి వచ్చింది. జ్ఞానంగల నాయకులు తమ ప్రధాన కార్యాలను లెక్కించేటప్పుడు, వారు తమ కుటుంబాలను తేలికగా తీసికోరు.[60]

## జ్ఞానంగల నాయకులు తమ అనుచరులను పనిలో దించుతారు (2 సమూ. 6:1, 2; 1 దినవృ. 13:1-4)

మన తరువాత పఠనం, యెహోవా మందసాన్ని దావీదు యెరూషలేమునకు తరలించడాన్ని గూర్చి ఉంటుంది. ఆ సందర్భంలో నాయకత్వాన్ని గూర్చిన రెండు వాస్తవాలను చూడవచ్చు. విషయాన్ని దావీదు ఎంత జ్ఞానయుక్తంగా పరిచయం చేశాడో దినవృత్తాంతముల లేఖకుడు తెలిపాడు:

> దావీదు సహస్రాధిపతులతోను శతాధిపతులతోను అధిపతులందరితోను ఆలోచన చేసి, సమాజముగా కూడిన ఇశ్రాయేలీయులందరితో ఈలాగు సెలవిచ్చెను. -ఈ యోచన మీ దృష్టికి అనుకూలమై మన దేవుడైన యెహోవావలన కలిగిన యెడల ఇశ్రాయేలీయుల నివాస ప్రదేశముల యందంతట శేషించియున్న మన సహోదరులును తమ పట్టణములలోను పల్లెలలోను కాపురమున్న యాజకులును లేవీయులును మనతో కూడుకొనునట్లు వారియొద్దకు పంపి మన దేవుని మందసమును మరల మనయొద్దకు కొనివత్తము రండి; సౌలు దినములలో దానియొద్ద మనము విచారణ చేయకయే యుంటిమి. ఈ కార్యము సమాజకులందరి దృష్టికి అనుకూలమాయెను గనుక జనులందరును ఆ ప్రకారము చేయుదుమనిరి (1 దినవృ. 13:1-4).

"ఆలోచన చేసి" అనే మాట "నీకు అనుకూలంగా ఉంటుందేమో" ఆలోచించు. దానికి ప్రత్యుత్తరాన్ని గమనించు: "ఈ కార్యము సమాజకులందరి దృష్టికి అనుకూలమాయెను గనుక జనులందరును ఆ ప్రకారము చేయుదుమనిరి." తన యిష్టం చొప్పున జరిగించడానికి రాజుగా దావీదుకు అధికారముంది. అయితే, మందసాన్ని యెరూషలేముకు తరలించడం అనేది ప్రజలపై తన యిష్టాన్ని బలవంత పెట్టకూడనంత ముఖ్యమైన సంగతి. గనుక అతడు వారి అభిప్రాయం కొరకు అడిగాడు. అది "రాజు యొక్క కార్య క్రమం" కాక ఇశ్రాయేలీయుల కార్యక్రమంగా చేయబూనాడు. జ్ఞానవంతులు విని నేర్చుకుంటారు.

## జ్ఞానంగల నాయకులు ఆత్మ సంబంధమైన సంగతులకు మిక్కిలి ఎక్కువైన ప్రాధాన్యత నిస్తారు

1 దినవృ. 13:1-4లో, యెహోవా మందసాన్ని యెరూషలేముకు తరలించడంలో పెట్టిన ప్రాముఖ్యతను గమనించు. ఇంతవరకు దావీదు చేసిన యావత్తు ఒక ముఖ్యమైన పని సాధనకే: ఇశ్రాయేలు ప్రజలను దేవుడైన యెహోవాతో సన్నిహితమైన బాంధవ్యాన్ని రప్పించడమే. దినవృత్తాంతముల లేఖకుని ప్రకారం, యెరూషలేమును తన రాజధాని నగరుగా[61] చేసికొన్న తరువాత, దావీదు చేసిన మొదటి పని మందసాన్ని యెరూషలేమునకు తరలించే ఏర్పాటే. జ్ఞానంగల నాయకులు ఆత్మ సంబంధమైన సంగతులకు అధిక ప్రాధాన్యతనిస్తారు.

## ముగింపు

యూదా గోత్రంచే దావీదు రాజుగా అభిషేకింపబడిన తరువాత కలిగిన అద్భుతమైన ఆరంభంతో నీవు బహుగా ఒప్పింపబడ్డావని నిరీక్షిస్తున్నా. నేను ఈ వచనాలను చదువుతున్న కొలది, "దేవా నీవు నన్ను ఎప్పుడు నాయకత్వంలో ఉంచినా, తన పరిపాలన ఆరంభంలో దావీదు కనుపరచిన జ్ఞానాన్ని నాకు ప్రసాదించుము" అనేదే నా ప్రార్థన.

ఏదియెలాగున్నా, మనలో ఎక్కువమంది నాయకులను వెంబడించే స్థితిలోనే నిలిచి యున్నందున, నాయకత్వం ఎంత ప్రాముఖ్యమో సహవాసం కూడా అంతే ప్రాముఖ్యమన్న విషయాన్ని నేను నొక్కి చెప్పాలి.[62] ఆయనను మహిమపరచే నాయకులను మనకు ప్రసాదించేలా మనం దేవుని ప్రార్థించాలి. మనకు యిప్పటికే ఉన్న నాయకుల కొరకు కూడా మనం ప్రార్థించాలి.[63] మన నాయకులలోనుండి శ్రేష్ఠమైన దానిని బయటికి తెచ్చే అనుచరులముగా మనం నడుచుకొనడానికి తీర్మానించుకోవాలి.[64]

"దేవా, జ్ఞానముగల నాయకులను మాకు ప్రసాదించండి. మమ్మును నమ్మకంగా వెంబడించేవారంగా తీర్చిదిద్దండి."

---

## ప్రసంగపు నోట్సు

బైబిలు కథా పాఠాలను రెండు విధాలుగా చదువవచ్చు: కథ చదువుతూ పోతుండగా నీవు పాఠాన్ని వర్తింపజేయవచ్చు. లేదా నీవు కథను చెప్పి తరువాత దాన్ని వర్తింప జేయవచ్చు. ఈ వరుసలోని పాఠాలన్నీ తొలి పంథాను అనుసరించాయి. "అడుగు భాగానికి తగులకుండ శిఖరమునకు చేరుకునేది ఎలా" అన్న పాఠం రెండవ దాన్ననుసరిస్తుంది. ఈ పాఠాల్లోన్ని సమాచారాన్ని ఏ పంథాలోనైనా వినియోగించుకోవచ్చు. ఒక పాఠానికి ఒక పంథా "సరిగా ఉండకపోతే" రెండోదాన్ని ఉపయోగించుకోవచ్చు.

నాయకత్వాన్ని గూర్చిన ప్రతి పాఠానికి, సహవాసం మీద ఒకటి అవసరమై యుంటుంది. ఈ లేఖన భాగాల్లోనుండి మంచి అనుచరులకు చాలా పాయింట్లు తీయవచ్చు.

యోవాబు అబ్నేరు అనే యిద్దరు చాలా ఆకర్షణీయమైన వ్యక్తులు. వ్యక్తుల శీలముపై ప్రయోజనకరమైన పాఠాలు వారిద్దరిమీద చెప్పవచ్చు. ఒకే పాఠంలో ఆ వ్యక్తులయొక్క తారతమ్యాన్ని తెలపడం శ్రద్ధ కలిగించేదిగా ఉంటుంది.

కీర్తన 30 దావీదు వ్రాసినట్టు చెప్పబడుతుంది. "గృహ ప్రతిష్ఠతను గూర్చిన పాట." అది తన రాజ భవనానికి సంబంధించి కావచ్చు. రాజ నగరు నిర్మాణాన్ని గూర్చి ఈ పాఠంలో ప్రస్తావించబడింది. దావీదు రాజుగా ఉన్న తొలి దినాల్లో 27వ కీర్తన వ్రాసినట్టు కొందరు తలంచుతున్నారు. 133వ కీర్తన, సహోదరుల ఐక్యత మన పాఠంతోను, పిల్లల దీవెనలు 127వ కీర్తనతోను సహజంగా ముడివేయవచ్చు.

---

సూచనలు

[1]W. Phillip Keller, *David, the Shepherd King* (Waco, Tex.: Word, 1986), 15. [2]దావీదు అభిషేకింపబడింది యిది రెండవసారి. [3]బెన్యామీను గోత్రం 600 మందికి తగ్గింపబడినప్పుడు, యాబేష్గిలాదునుండి వారు నాలుగువందల కన్యలను భార్యలుగా తీసికొన్నారు (న్యాయాధి. 21:8-14). సౌలు ఏలుబడి యొక్క ఆరంభ దినాల్లో కూడ, వారి కన్నులను ఊడదీసి అమ్మోనీయులు యాబేష్గిలాదు నివాసులను బానిసలుగా చేసికోబోయినప్పుడు, సౌలు వారిని విడిపించాడు (1 సమూ. 11:1-11). [4]వారిని పాతిపెట్టక మునుపు, వారు వారి దేహాలను దహించారు (1 సమూ. 31:12). దేహాలు సంపూర్ణంగా బూడిదకాలేదు. తరువాత దావీదు ఎముకలను త్రవ్వించాడు (2 సమూ. 21:12-14). ఆరోగ్య రక్షణ కొరకు వారు ఈ పని చేసియుండవచ్చు; లేక అది స్థానిక ఆచారమైయుండవచ్చు; అయితే అది యూదుల ఆచారం కాదు. [5]మెఫీబోషెతుపై తాను చూపిన దయనుబట్టి, దావీదు యోనాతానుకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చినట్టు గమనించు. [6]1 యోహాను 4:20. [7]కీర్తన 133:1 గమనించు, ఐక్యత ప్రాముఖ్యమైనది. అయితే ఐక్యతకంటెను పవిత్రత విశ్వాస్యత అనేవి ప్రాముఖ్యమైనవి (యాకోబు 3:17ఎ; మత్తయి 10:34); అయితే ఐక్యత వీటివెంట వచ్చే గమ్యమై యుంటుంది. [8]1 సమూ. 17:55; 26:5. [9]2 సమూ. 3:17 గమనించు. [10]తన సొంత సైన్యాధిపతియైన యోవాబుకంటె దావీదు అబ్నేరును ఎక్కువగా అభినందించాడు (1 రాజులు 2:32).

[11]2 సమూ. 3:9, 10, 18 గమనించు. సౌలుయొక్క ప్రాణాన్ని దావీదు విడిచిపెట్టిన రెండు సంఘటనలలోను అబ్నేరు ఉన్నాడు. తన తరువాత రాజు దావీదేనని సౌలు ఒప్పుకున్నాడు (1 సమూ. 24;26). [12]అబ్నేరు సౌలుకు పినతండ్రి కుమారుడు (1 సమూ. 14:50, 51). [13]దావీదు సైన్యానికి యోవాబు నాయకుడుగా 2 సమూ. 2:13లో తొలిసారిగా ప్రస్తావించబడింది. [14]దావీదుతోపాటు అబిషై సౌలుయొక్క శిబిరంలోనికి వచ్చాడు; అతడు సౌలును చంపగోరాడు. [15]వారు జెరూయా అనే దావీదు సహోదరి యొక్క కుమారులు. [16]యోవాబు కేవలం 20 మందిని మాత్రమే పోగొట్టుకొనగా, అబ్నేరు 360 మందిని పోగొట్టుకున్నాడు (2 సమూ. 2:31). [17]NEBని గమనించు: "అబ్నేరు **ఈటె మడమతో** అతని కడుపులో పొడిచినందున ఈటె అతని వెనుకకు వచ్చెను గనుక అతడు అచ్చటనే పడి చచ్చెను" (2 సమూ. 2:23; ఒత్తి పలకడం నాది). అబ్నేరు ఈటెను నేలకు నాటించి ఉండొచ్చు, అశాహేలు తరుముటవలన ఈటెపై కొరుత వేసి చంపడం జరిగియుండవచ్చు. [18]2 సమూయేలులోని సమాచారం కాలక్రమంలో గాక, అంశ క్రమంలో కూర్చబడినందున విషయాలు ఏ క్రమంలో జరిగాయో గ్రహించడం కష్టం. ఇష్బోషెతు రెండు సంవత్సరాలు ఏలి, దావీదు రాజు కాకముందే చంపబడినందున, దావీదు యూదాలో ఏలిన చివరి సంవత్సరాలలో సమమైయుండవచ్చు. [19]ఈ గిలాదీయుల పట్టణం యొర్దానుకు అడ్డముగా హెబ్రోనుకు సుమారు 50 మైళ్ల దూరంలో ఉంటుంది. [20]ఇష్బోషెతు అంటే అక్షరార్థం- "అవమాన పుత్రుడు." అది అతని మారుపేరై యుండవచ్చు.

[21]1 దినవృ. 8:33. "ఎష్బయలు"-అంటే "బయలు మనిషి" అని అర్థం. "ప్రభువు మనిషియని" కూడా అది అయ్యుండవచ్చు. "ప్రభువు" అనేది యెహోవాను సూచించునదై యుండవచ్చు. [22] 1 దినవృ. 8:33లోని పట్టికలో ఇష్బోషెతు పేరు ఆకరిలో ఉంది. 2 సమూ. 21:8లో సౌలుయొక్క మరి యిద్దరు కుమారులు ప్రస్తావించబడ్డారు. వారు యింకా చిన్నవారై యుంటారని నా అభిప్రాయం. [23]2 సమూ. 3:11; 4:1తో పోల్చి చూడు. [24]అబ్నేరు దోషియో కాదో

హెబ్రీలో సూచింపబడలేదు. కొన్ని తర్జుమాలు సెప్టూజంటును వెంబడించాయి. అందులో 7వ వచనం చివర: “అబ్నేరు ఆమెను పరిగ్రహించాడు” అని ఉంది. [25]2 సమూ. 3:12. [26]సామెతలు 16:7. [27]దావీదు ఒక షరత్తు నియమించాడు – అది వింతైనది–తన భార్యయైన మీకాలును తనకు తిరిగి యిప్పించడం. “దావీదు విన్నపం, మీకాలు” అనే; పఠాన్ని చూడు. [28]సామెతలు 25:21 రచించినప్పుడు అతని కుమారుడైన సొలొమోను మనస్సులో యిది ఉండవచ్చు. [29]2 సమూ. 18:5, 14; 1 రాజులు 2:5, 6. [30]గుర్తింపదగిన ఒక మినహాయింపు 2 సమూ. 10:12.

[31]అబ్నేరును చంపడంలో అబిషైకి కూడా పాలు ఉంది (2 సమూ. 3:30). [32]అబ్నేరును చంపడంలో యోవాబుకు పలు ఉద్దేశాలు ఉండి యుండవచ్చు. అయితే 2 సమూ. 30:27, 30 ప్రకారం పగ తీర్చుకొనడమే అతని ప్రాథమిక ఉద్దేశం. [33]దావీదు యెరూషలేమును పట్టుకొనడానికి వెళ్లినప్పుడు, సైన్యాధిపతి యొక్క స్థానం ఖాళీగా ఉంది (1 దినవృ. 11:6). [34]కాలక్రమంలో యోవాబు చంపివేయబడ్డాడు అనేది గుర్తించాలి. దానికై ప్రస్తావించబడిన ఒక నేరం అబ్నేరును హత్య చేయడం (1 రాజులు 2:28–34). [35]గోనెపట్ట అంటే, దుఃఖానికి లేక మారుమనస్సునకును సూచనగా ధరించే ముతక బట్ట. [36]సామెతలు 1:1, 2; 2:2 వగైరాలను చూడు. [37]వారి చర్యలో పగ కూడా దాగియుండవచ్చు. గిబియోనీయులను లయపరచడానికి సౌలు ప్రయత్నించినట్టు చెప్పబడింది (2 సమూ. 21:2). ఈ సహోదరులు గిబియోనీయుల పట్టణంనుండి వచ్చినవారే (యెహోషువ 9:17; 18:25). [38]“ఇంటి ద్వార పాలకుడు గోధుమలను శుద్ధి చేయుచు, అతడు కునికి నిద్రించాడు; గనుక రేకాబును అతని సహోదరుడైన బయనాయు యింటజొచ్చిరి” అని RSV సెప్టూజెంటుననుసరించి తర్జుమా చేసింది. [39]వ్యక్తి బలహీనుడైనా ఇష్బోషెతు సహజంగా మంచివాడనే భావన దావీదుకు ఉన్నట్టుంది. [40]రోమా 8:31.

[41]ఇది దావీదుయొక్క మూడవ అభిషేకము. [42]3,40,000 మంది హెబ్రోనుకు వచ్చినట్టు లేఖనం చెప్తూతోంది. వారు రాలేదని నమ్మడానికి ఏ హేతువు లేదు. అయితే ప్రతినిధి బృందం వచ్చియుండవచ్చు. ఏ విధంగా చూచినా పెద్ద గుంపే కూడింది. [43]ఆదికాండం 14:18నుండి–“షాలేము” అనేది “యెరూషలేము” యొక్క చిన్న రూపం (కీర్తన 76:2ను చూడు). [44]యెహోషువ 10:22–27తో పోల్చి చూడు. [45]యెహోషువ 15:63 [46]న్యాయాధి. 1:21. [47]యెరూషలేము కొన్ని సార్లు “యెబుస్” అని పిలువబడింది (న్యాయాధి. 19:10; 1 దినవృ. 11:4). [48]2 సమూ. 5:6 చూడు. [49]దావీదు దాన్ని పట్టుకొన్నప్పుడు యెరూషలేము కేవలం ఎనిమిది లేక పది ఎకరాల విస్తీర్ణంగా ఉండేది. “మిల్లో” అనే మాటను గమనించు (2 సమూ. 5:9); “పూడ్చు” అని అర్థమిచ్చే హెబ్రీ పదంనుండి అది వచ్చింది. NIV దానిని “పై కప్పులను నిలుపునది” అన్నట్టు తర్జుమా చేసింది. [50]హెబ్రీ. 13:17.

[51]మనకు తెలిసినంతమట్టుకు, దావీదును గూర్చి యివే మాటలు పలుకబడలేదు, అయితే సౌలును గూర్చి పలుకబడ్డాయి (1 సమూ. 9:16తో పోల్చి చూడు). సౌలు ఆ ఆజ్ఞను నెరవేర్చలేదు గనుక, సౌలు స్థలంలో దేవుడు ఏర్పాటు చేసికొన్న మనిషికి అవి వర్తింపజేయబడ్డాయి. [52]1 దినవృ. 14:9లో ఫిలిష్తీయులు లోయపై దాడి చేశారు అని అంటుంది. [53]అపొ. 20:28–30 గమనించు. [54]వారు యితర రాజుల సహాయం కోరినట్టును, వారి రెండవ సైన్యం మొదటి దానికంటే మూడంతలు పెద్దదైయున్నట్టును జోసీఫస్ అన్నాడు. [55]ఆకులు కదిలాయి గల గలమన్నాయి, అయితే గాలిలేదు అని జోసీఫస్ అన్నాడు. [56]2 సమూ. 23:8; 1 దినవృ 11:10. [57]దావీదు హెబ్రోనులో నివసించినప్పుడు యింకను నలుగురు స్త్రీలను పెండ్లి చేసికొనినట్లు మనం పరోక్షంగా కూడా తెలుపబడ్డాం. [58]యెరూషలేమునుండి ఎక్కువ మంది భార్యలను ఉప పత్నులను దావీదు తీసికొన్నట్టును మనం చెప్పబడ్డాం. దావీదు యొక్క బహు భార్యత్వపు చర్యను రచయిత ప్రత్యక్షంగా విమర్శించలేదు. ఇది ద్వితీయో. 17:17తో సంఘర్షిస్తుంది. అయితే కథ జరిగేకొద్ది, వినాశకరమైన ఫలితాలు తమకు తామే పలికాయి. [59]1 రాజులు 1:6ను గమనించు. [60]అశ్రద్ధ చేయబడిన బాంధవ్యాలు ప్రేమను నాశనం చేస్తాయి అని నొక్కి చెప్పడానికి మీకాలు దావీదు కథను యిక్కడ చేర్చవచ్చు.

[61]1 దినవృ. 11:1–9ని కార్యంలో 1 దినవృ. 13:1 వెంబడిస్తుంది. ఈ మధ్య వచనాలు “దావీదు యొక్క పరాక్రమ శాలులను” గూర్చి తెలుపుతుంది. 1 దినవృత్తాంతాల ప్రకారం, దావీదును, ఫిలిష్తీయులపై దావీదు యుద్ధాలను హీరాము గుర్తించాడు. దావీదు మందసాన్ని యెరూషలేముకు కొనివచ్చే దానికి మధ్య తక్కిన సంఘటనలు సంభవించాయి (1 దినవృ. 13), మందసాన్ని తరలించడంలో అతడు చివరికి విజయాన్ని సాధించాడు (1 దినవృ. 15). ఇది సంఘటనల క్రమమని నేను నమ్ముతున్నాను. [62]“వెంబడించువారు” అనేది ఎక్కువ హెచ్చు తగ్గులు లేనిదిగా ఉంటుంది, అయితే “సహవాసం” అనే శబ్దాన్ని నేను ఎక్కువగా కోరతాను. [63]వారు ప్రభుత్వంలో ఉన్నా (1 తిమోతి 2:1, 2), సంఘంలో ఉన్నా (హెబ్రీ 13:17, 18), లేక గృహంలో ఉన్నా, మనం వారికొరకు ప్రార్థించాలి. [64]ప్రభుత్వంలో ఉన్నా (రోమా 13:1నుండి), సంఘంలో ఉన్నా (హెబ్రీ. 13:17), లేక గృహంలో ఉన్నా, మనం వారికి లోబడవలసిందే (ఎఫెసీ. 5:22; 6:1–3).